
ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు..



ఉట్నూర్ మండలం లక్కారం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై వెకిలి చేష్టలకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై విద్యార్థి సంఘాలు డీఈవోకు ఫిర్యాదు చేశాయి. విచారణ అనంతరం సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. 8లో▸



'గిరి' గూడేల్లో పండుగల సీజన్

ఆదివాసీ, గిరిజన గూడేల్లో పండుగల సీజన్ మొదలైంది. అకాడితో ప్రారంభమై దీపావళితో ముగియనున్నాయి. నాలుగు నెలల పాటు సందడి కొనసాగనుంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశాలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 6న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.గణపతి ప్రకటనలో తెలిపారు. చైర్మన్ జనార్దన్ రాథోడ్ అధ్యక్షతన తన కార్యాలయ చాంబర్‌లో నిర్వహించే సమావేశాలకు సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మెరిట్ జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్ జాబితాను బుధవారం విడుదల చేశారు. కార్యాలయంలోని నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే గురువారం సాయంత్రం 5 గంటల్లోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత తెలిపారు. ఈనెల 10న తుది జాబితాతో పాటు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. 11న అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి ఎంబీఏ అండ్ ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం)లో అడ్మిషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ ప్రతాప్‌సింగ్ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. టీఎస్ ఐసెట్, ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించిన వారు నేరుగా ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ఈనెల 30 వరకు ఉందని, వివరాలకు ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



బేల స్టేషన్‌లో విధుల నిర్వహణపై ఆరా తీస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

బేల: పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది తీరుతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా మండలంలోని శంకర్‌గూడ గ్రామ శివారులో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటుకు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సరిహద్దున మహారాష్ట్ర ఉండడంతో నిరంతరం పర్యవేక్షిస్తుండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జైనథ్ సీఐ నరేశ్, ఎస్సై కృష్ణకుమార్ ఉన్నారు.

సరిహద్దు గ్రామాల్లో ..

జైనథ్: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన జైనథ్ మండలం ఆనంద్‌పూర్‌లో ఎస్పీ బుధవారం పర్యటించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పెన్‌గంగ బ్రిడ్జి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు నిమిత్తం పరిశీలించారు. అనంతరం స్టేషన్‌కు చేరుకుని రికార్డులు తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఐ నరేశ్, ఎస్సై పెర్సిస్ బిట్ల, తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీ మిల్కాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేసేలా చూడాలని కోరారు. అలాగే ఐసీడీఎస్‌కు ప్రమాదకరంగా మారిన 2020 నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. షరతులు లేకుండా మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తించాలన్నారు. 2018 అక్టోబర్‌లో కేంద్రం పెంచిన వేతనంను రాష్ట్రప్రభుత్వం ఏరియర్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, అంగన్‌వాడీ నాయకులు వెంకటమ్మ, సుభద్ర, పంచపూల, ప్రమీళ, పంచశీల, కళ్యాణి, సురేఖ, కవిత తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్ దిశగా..

- ఆదిలాబాద్ మున్సిపాలిటీ అప్‌గ్రేడ్‌కు ప్రభుత్వం కసరత్తు
- నాలుగు గ్రామాలు విలీనమయ్యే అవకాశం?

వివరాలు
పట్టణ జనాభా: 1,80,390
మొత్తం కుటుంబాలు: 48,393
విస్తీర్ణం:50.69 కిలోమీటర్లు
వార్డులు:49
రోడ్ల విస్తీర్ణం:546.77 కిలోమీటర్లు
డ్రెయినేజీల విస్తీర్ణం:462.83 కిలోమీటర్లు



ఆదిలాబాద్ పట్టణ ముఖచిత్రం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీ ఇక కార్పొరేషన్ కానుందా అంటే అవుననే సంకేతాలే కనిపిస్తున్నాయి. గ్రేడ్–1 స్థాయి కలిగిన ఈ బల్దియాను కార్పొరేషన్‌గా మార్చే దిశగా ప్రభుత్వం కసరత్తు చేపట్టినట్లు తెలుస్తోంది. మరో రెండేళ్లలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని గ్రేడ్–1, స్పెషల్ గ్రేడ్ హోదా కలిగిన మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు యోచిస్తోంది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ బల్దియాకు తొలి ప్రాధాన్యత దక్కనుందనే అభిప్రాయం యంత్రాంగం నుంచి వ్యక్తమవుతోంది. ప్రతిపాదనలు సైతం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. పట్టణానికి ఆనుకుని ఉన్న మావల, బట్టిసావర్‌గాంవ్ గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. వాటి విలీనంతో పట్టణ పరిధి పెరిగే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మెరుగైన సేవలే లక్ష్యంగా...

జిల్లాలోని ఏకైక మున్సిపాలిటీ అయిన ఆదిలాబాద్ రోజురోజుకు విస్తరిస్తోంది. పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతుండటంతో పాటు జనాభా కూడా నానాటికి పెరుగుతోంది. ఈ క్రమంలో మౌలిక వసతుల కల్పన, మెరుగైన సేవలందించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్, గ్రేడ్–1 స్థాయి కలిగిన మున్సిపాల్టీలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ (సీడీఎంఏ) అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. పట్టణ జనాభా, వార్డులు, విస్తీర్ణం, ఓటర్లు వంటి వివరాలను రాష్ట్రస్థాయి అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ల ద్వారా ఈ వివరాలతో కూడిన ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లుగా తెలుస్తోంది.

వార్డులు.. డివిజన్లుగా

గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ప్రస్తుతం 49 వార్డులున్నాయి. కార్పొరేషన్‌గా మార్చితే ఈ వార్డులు డివిజన్లుగా మారిపోనున్నాయి. కౌన్సిలర్లు కార్పొరేటర్లుగా మారనుండగా, చైర్మన్ మేయర్‌గా వ్యవహరించనున్నారు. నాలుగు గ్రామాలను విలీనం చేయడం ద్వారా వార్డుల సంఖ్య 51 పెంచితే కార్పొరేషన్‌గా మార్చవచ్చనే అభిప్రాయం వ్యక్తమవతుంది. నూతన మున్సిపల్ చట్టం మార్గదర్శకాల ప్రకారం ఒక్కో వార్డులో 5,500– 6వేల జనాభా, 4నుంచి5వేల ఓటర్లు ఉండేలా వార్డులను డివిజన్లుగా మార్చనున్నారు. విలీన గ్రామాలు, వార్డుల విభజన వంటి వివరాలను సీడీఎంఏ అధికారులు మున్సిపల్ అధికారుల నుంచి సేకరిస్తున్నట్లుగా తెలుస్తోంది.

3లక్షల జనాభా దాటితే

నూతన మున్సిపల్ చట్టం–2019 ప్రకారం ఆదిలాబాద్ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలంటే పట్టణ జనాభా 3లక్షలు దాటి ఉండాలి. పట్టణంలో 2011 జనగణన ప్రకారం 1,55,390 మంది జనాభా ఉండగా, ఇటీవల ప్రభుత్వం ప్రణాళిక విభాగం శాఖ ద్వారా ప్రకటించిన వివరాల ప్రకారం 2,05,898కి చేరింది. కొత్తగా మరో 20వేల వరకు పెరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో కలుపుకుంటే జనాభా 2.25లక్షలకు చేరుకునే అవకాశం ఉంది. కార్పొరేషన్ ఏర్పాటుకు మరో 75 వేల జనాభా అవసరముందని భావించిన అధికారులు సమీప గ్రామాల విలీనానికి ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణాన్ని ఆనుకుని ఉండే మావల మండలంలోని బట్టిసావర్‌గాంవ్, మావల, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కచ్‌కంటి, తాంసి మండలంలోని పొన్నారి గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేయడం ద్వారా కార్పొరేషన్‌గా అవతరించే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

అభివృద్ధి, వసతులకు దోహదం

మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చితే పట్టణ ప్రజలకు ప్రత్యేక వసతులు సమకూరడంతో పాటు పట్టణాభివృద్ధి వేగవంతం కానుంది. ప్రభుత్వం కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లుగా తెలుస్తోంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీ అందుకు అన్ని విధాలా యోగ్యంగా ఉంది.

– ఏ.శైలజ, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

అర్హులందరికీ పోడు పట్టాలు



ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి పోడు పట్టాను అందజేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌రూరల్: అటవీ హక్కు చట్టం–2005 కింద అర్హులైన ప్రతీ ఒక్కరికి పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి లబ్ధిదారులకు పోడు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం చేసిన కుమురం భీం ఆశయ సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు అటవీ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో 12,222 కుటుంబాలకు 31,683 ఎకరాల అటవీ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు పంచాయితీ, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి బ్యాంకు ఖాతాల వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, ఏళ్ల నాటి గిరిజనుల కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ రూరల్, జైనథ్ ఎంపీపీ గంద్రత్ రమేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా అందే.. రైతు మురిసే

బోథ్: ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆదివాసీ, గిరిజనులకు ఎట్టకేలకు పోడు పట్టాలు అందాయి. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మిణ్‌సింగ్, వైస్ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, జెడ్పీకోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు పరిశీలన

బోథ్ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయిన తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును స్థానిక జెడ్పీటీసీ సంధ్యారాణి ఇటీవల కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ క్రమంలో కలెక్టర్ స్పందించి పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ అతికొద్దీన్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు. అలాగే బోథ్ మండల యువత కోసం నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా కలెక్టర్‌కు విన్నవించారు.

నెరవేరిన గిరిజనుల కల

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



పోడు పట్టాలను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆదివాసీ గిరిజనుల కలను సీఎం కేసీఆర్ నెరవేర్చారని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవన్‌లో 300 మంది ఆదివాసీ గిరిజనులకు బుధవారం పోడు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతుబాయి. సర్పంచ్ గజాననాయక్, పీఏసీఎస్ చైర్మన్ సురేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగరావు, ఎంపీడీవో రమేశ్, ఏటీడీవో క్రాంతి కుమార్, ఏవో రమేశ్, ఏఈవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గాదిగూడలో..

గాదిగూడ మండలంలో 320 మంది రైతులకు పోడు పట్టాలను జెడ్పీ చైర్మన్ జనార్దన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేష్ పాల్గొన్నారు.

పచ్చ తోరణం

మండలంలోని ముఖరా(కే) పంచాయతీకి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పచ్చందాలు కనువిందు చేస్తున్నాయి. సుమారు కిలోమీటర్ పొడవునా రహదారికి ఇరువైపులా నాటిన ఐదు వేల మొక్కలు ప్రస్తుతం చెట్లుగా ఎదిగాయి. ఇటీవల కురిసిన వర్షాలతో అవి ఇలా చిగురించి చూపరులను ఆకర్షిస్తున్నాయి. – ఇచ్చోడ



బుజ్జగింపా.. మంత్రి పదవా?

- మూడు రోజులుగా ఢిల్లీలోనే ఎంపీ 'సోయం'
- హైకమాండ్ పిలుపుతోనే వెళ్లాడంటున్న శ్రేణులు
- పార్టీ మార్పు ఊహాగానాల నేపథ్యంలో ఒక రకమైన ప్రచారం
- ఎస్టీ కోటాలో మంత్రి పదవిపై పరిశీలన అంటున్న పార్టీ వర్గాలు



ఎంపీ సోయం బాపురావు

సాక్షి, ఆదిలాబాద్: ఎంపీ సోయం బాపూరావు మూడు రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలోనే ఉన్నారు. హైకమాండ్ పిలుపుతోనే ఆయన గత శనివారం ఇక్కడి నుంచి బయల్దేరి వెళ్లినట్లు పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ప్రధానంగా ఆయనను బుజ్జగించేందుకు పిలిచారా.. లేని పక్షంలో కేంద్ర మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ త్వరలో ఉంటుందని, ఈ నేపథ్యంలో ఆయనకు సహాయ మంత్రి పదవి ఇచ్చేందుకే ఈ పిలుపని పార్టీలో రెండు రకాల ప్రచారాలు సాగుతున్నాయి. తెలంగాణకు రెండు కేంద్ర మంత్రి పదవులు కేటాయించే అవకాశం ఉందని, ఇందులో ఎస్టీ కోటాలో సోయంకు పదవి దక్కనుందనే ప్రచారం కూడా ఉంది. ఏదేమైనా ఈ పరిణామాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

ప్రచారాలకు ఊతం ఇలా..

కొద్ది రోజుల క్రితం ఎంపీ ల్యాడ్స్ విషయంలో సోయం బాపూరావు వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఇప్పటి వరకు ఆ నిధులు పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులకు కేటాయించలేకపోయానని, తన కొడుకు పెళ్లి.. ఇంటి నిర్మాణంలో వాటిని వాడుకోవాల్సి వచ్చిందని ఆయన అంటున్నటువంటి వీడియో క్లిప్ వైరల్ అయింది. ఆ తర్వాత సోయం బాపూరావు వైరల్ అయిన వీడియోలోని మాటలను ఖండించారు. పార్టీలో కొంతమంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారంటూ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌పై ఆరోపణలు సంధించారు. వీటి తర్వాత ఆయన పార్టీ మారుతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో విస్తృతంగా సాగింది. ఈ నేపథ్యంలో హైకమాండ్ బుజ్జగించేందుకే ఢిల్లీకి పిలిచిందా అనే ప్రచారం సాగుతోంది. మరో వైపు తెలంగాణ నుంచి ఇద్దరికి మంత్రి పదవులు దక్కడం ఖాయమని ప్రచారం సాగుతుండగా బీసీ కోటాలో ఒకరికి, ఎస్టీ కోటాలో సోయంను వరించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

పార్టీ పరిణామాలపై స్తబ్ధత..

పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి బండి సంజయ్ రాజీనామా చేయడం, ఆ స్థానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని హైకమాండ్ నియమించడంపై జిల్లా పార్టీ వర్గాల్లో బాహాటంగా ఎవరు ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదు. అయితే ఓ వర్గం ఈ పరిణామాలతో నారాజ్ ఉండగా, మరో వర్గం పార్టీ నిర్ణయాన్ని గౌరవించాల్సిందేనన్న రీతిలో ఉన్నారు. ఇదిలా ఉంటే కొంత మంది ద్వితీయ శ్రేణి నేతలు వాట్సాప్ స్టేటస్‌లో బండి సంజయ్‌తోనే రాష్ట్రంలో బీజేపీ బలోపేతం అయిందని ఆయన తొలగింపు సరికాదనే విధంగా పోస్టులు పెడుతున్నారు. మొత్తంగా రెండు రోజులుగా కమలం పార్టీలో జరుగుతున్న పరిణామాలను అటు సాధారణ జనంతో పాటు ఇటు పార్టీ శ్రేణులు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

'కిసాన్'కు.. ఈకేవైసీ తప్పనిసరి

- వ్యవసాయశాఖ ప్రత్యేక దృష్టి
- వృద్ధులు, దివ్యాంగుల వివరాలు ఫేస్‌యాప్ ద్వారా నమోదు

జిల్లాలో కిసాన్ సమ్మాన్ లబ్ధిపొందే రైతులు:84,266
ఈనెల 3 వరకు అప్‌డేట్ అయిన వారు : 78,926
ఇంకా అప్‌డేట్ చేసుకోవాల్సిన రైతులు : 5,340



ఇచ్చోడలో వృద్ధుల వివరాలు ఫేస్‌యాప్ ద్వారా ఈకేవైసీలో నమోదు చేస్తున్న ఏవో కైలాస్

ఇచ్చోడ: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నగదు జమకు ఈకేవైసీ తప్పనిసరి చేసింది కేంద్ర ప్రభుత్వం. అయితే దీనిపై గతేడాది ప్రత్యేక నిబంధనలు విధించిన క్రమంలో జిల్లాలో చాలా మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదు. దీంతో వేల మంది రైతులకు 13 విడతలో డబ్బులు జమకాలేదు. 14వ విడతలోనూ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ఈ ప్రక్రియపై వ్యవసాయశాఖ నిమగ్నమైంది. ఈమేరకు సంబంధిత అధికారులు ఈకేవైసీ అనుసంధానం చేయడంలో బిజీగా ఉన్నారు. వృద్ధులు, వేలిముద్రలు పడని వారిని గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి సైతం వివరాలు నమోదు చేస్తున్నారు.

నమోదు ఇలా...

ఈకేవైసీ ప్రకియను ఆధార్ లింకుతో ఓటీపీ ద్వారా పూర్తి చేసుకోవచ్చు. ఆధార్ లింకై ఉంటే సంబంధిత భూ యజమాని మొబైల్‌కు ఓటీపీ వస్తోంది. అది నమోదు చేస్తే ప్రక్రియ పూర్తవుతుంది. అలాగే బయోమెట్రిక్, వేలిముద్రల ద్వారా కూడా పూర్తి చేసుకోవచ్చు. తాజాగా ఫేస్‌యాప్ ద్వారా కూడా నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వృద్ధులు, దివ్యాంగులు, ఇంటి నుంచి బయటకు రాలేని వారి వివరాలను ఈ యాప్ ద్వారా నమోదు చేయవచ్చు. ప్రస్తుతం ఇలాంటి వారి ముఖాన్ని యాప్‌లో ఫొటో తీసుకొని ఏవోలు, ఏఈవోలు ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు.

అప్‌డేట్ చేసుకోవాలి

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కోసం రైతులు తమ ఈకేవైసీని అప్‌డేట్ చేసుకోవాలి. ఇందుకోసం వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. ఇంకా అప్‌డేట్ చేసుకోని వారు సంబంధిత ఏఈవోలను వెంటనే సంప్రదించాలి.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

ఉప్పొంగిన పెద్ద వాగు..



నక్కలవాడ బ్రిడ్జి పైనుంచి వరద ఉధృతి

- నాలుగు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

బోథ్: మండలంలోని నక్కలవాడ సమీపంలో గల పెద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో బ్రిడ్జిపై నుంచి వరద పోటెత్తింది. దీంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని మర్లపల్లి, బాబెర, నిగినితో పాటు ఎగువన బుధవారం కురిసిన వర్షానికి కరత్వాడ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పెద్ద వాగు ద్వారా బ్రిడ్జిపై నుంచి వరద పోటెత్తింది. దీంతో మండలంలోని నక్కలవాడ, లక్ష్మీపూర్, కొత్తపల్లె, రేండ్లపల్లె ప్రజలు మండల కేంద్రానికి రాలేని పరిస్థితి. ఏటా వర్షానికి బ్రిడ్జిపై నుంచి వాగు వరద ప్రవహిస్తోందని, హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని పలుమార్లు కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ విజయ్ కుమార్, ఎంపీటీసీ జుగాదిరావ్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో మనుబోతు మృతి



మనుబోతును పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: మండలంలోని లింబా(బి) అటవీ ప్రాంతంలో మనుబోతుపై కుక్కలు దాడి చేశాయి. మనుబోతు గ్రామ సమీపంలోని తెలంగాణ క్రీడాప్రాంగణం వైపు దూసుకొచ్చింది. కుక్కలు మనుబోతును తీవ్రంగా గాయపరచడంతో మృతిచెందింది. సర్పంచ్ మల్లేష్ సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని ఎఫ్‌బీవో హరిలత పరిశీలించారు. పశువైద్యాధికారి ప్రకాష్ పంచనామా నిర్వహించి అటవీ ప్రాంతంలో జేసీబీ సాయంతో పూడ్చివేశారు.

విద్యార్థికి గాయాలు...

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో పిచ్చికుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మూడో తరగతి విద్యార్థిపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వివరాల్లోకి వెళితే అర్లి(టి) గ్రామానికి చెందిన వేదశ్రీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళ్లిన విద్యార్థి విరామ సమయంలో పాఠశాల సమీపంలోని కిరాణంకు వెళ్లి తిరిగి పాఠశాలకు వస్తుండగా పిచ్చికుక్క దాడి చేసి చిన్నారిని తీవ్రంగా గాయపరిచింది. వెంటనే అక్కడున్న స్థానికులు జోక్యం చేసుకుని పిచ్చికుక్క బారి నుంచి చిన్నారిని తప్పించారు. కాగా గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించి వేదశ్రీని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

జింకకు గాయాలు..

తానూరు: మండలంలోని కోలూరు గ్రామ శివారులో కుక్కల దాడిలో జింకకు గాయాలయ్యాయి. గ్రామస్తులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారు ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం వ్యవసాయ చేనులో కుక్కలు జింకను వెంబడించాయి. గమనించిన రైతు పరమేశ్వర్ కుక్కల దాడి నుంచి జింకను రక్షించి పశువైద్యశాలలో పరీక్షలు నిర్వహించి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. ఎస్సై విక్రమ్ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని జింకను బాసరకు తరలించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య..

జైనథ్: అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్ప డిన సంఘటన మండలంలోని దీపాయిగూడ గ్రా మంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల క థనం ప్రకారం... మండలంలోని దీపాయిగూడ గ్రా మానికి చెందిన లోక రవీంద్‌రెడ్డి (52) తనకున్న నా లుగు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూడేళ్లుగా దిగుబడి సరిగా రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.1.50 లక్షలు, ప్రైవేటుగా చేసిన అప్పులు పేరుకుపోయాయి. ఈ ఏడాది సైతం తన కున్న నాలుగు ఎకరాల్లో సోయా విత్తనాలు వేసినప్పటికీ వర్షాలు సహకరించక మొలకెత్త లేవు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మంగళవారం అర్ధరాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య అనురాధ చుట్టుపక్కల వారి సాయంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. బుధవారం వేకువజామున చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘గిరి’ గూడేల్లో పండుగల సీజన్

- అకాడితో ప్రారంభమై దీపావళితో ముగింపు
- నాలుగు మాసాలు వివిధ రకాల పండుగలు
- కుల దేవతలకు ప్రత్యేక పూజలు
- ఆదివాసీ పల్లెల్లో కోలాహలం



ఆకిపేన్ వద్ద పూజలు



మేకతో జాతకం చెప్పించుకుంటున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): మారుతున్న ఆధునిక కాలంలోనూ ఆదివాసీలు తమ ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. ఏటా ఆషాఢమాసంలో వచ్చే అకాడి పండుగతో ప్రారంభమైన ఆదివాసీ పండుగలు, ఉత్సవాలు దీపావళి పర్వదినంతో ముగుస్తాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆయా గ్రామాల్లో ఆదివాసీలు అకాడి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అకాడి తర్వాత జాంబురావుస్, శివబోడి, నాగపంచమి, రక్షాబంధన్, పొలాల అమావాస్య, బడిగా, దసరా, దీపావళి పండుగలు జరుపుకుంటారు.

అకాడి పండుగ..

ఆషాఢమాసం ప్రారంభంలో వచ్చే పండుగ అకాడి. అడవిని దేవతగా కొలిచే ఆదివాసీలు పాడిపశువులకు రక్షణ కల్పించే దేవతగా రాజుల్ పేన్‌ను పూజిస్తారు. నెలవంక కనిపించగానే ప్రారంభమయ్యే ఈ పండుగను జిల్లాలోని అన్ని గ్రామాల్లో జరుపుకుంటారు. అకాడి పండగను కొందరు పౌర్ణమి వరకు నిర్వహిస్తే మరికొందరు అమావాస్య వరకు జరుపుకుంటారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారమని ఆదివాసీ పెద్దలు, కటోడాలు చెబుతున్నారు. అకాడిలో భాగంగా ఆకీపేన్‌కు పూజలు చేస్తారు. ఈ కాలంలో మేతకోసం అడవిలోకి వెళ్లే మూగజీవాలకు ఎలాంటి హాని తలపెట్టవద్దని, సాగు చేసిన పంటలు అధిక దిగుబడులు సాధించాలని ఆకిపేన్‌కు పూజలు చేస్తారు. ఇందులో భాగంగా ఒక గీత గీసి ఆ గీతపై నుంచి పశువులను అడవిలోకి తోలుకెళ్తారు. ప్రత్యేకంగా తయారుచేసిన తుర్రను ఊదడంతో పశువులు అడవిలోకి పరుగెత్తుతాయి. అంతేకాకుండా కోడి, మేకలతో జాతకం చెప్పించుకుంటారు.

విజ్జపేన్..!

ఈ క్రమంలోనే విజ్జపేన్ (విత్తన పూజలు) చేస్తారు. కొనుగోలు చేసిన విత్తనాలను పెర్సాపేన్, రాజుల్ దేవతలకు చూపించి పూజలు చేస్తారు. పంటలకు ఎలాంటి హాని కలగకుండా చూడాలని పెర్సాపేన్‌కు మొక్కుతారు. అనంతరం ఎవరికి వారు తమ ఇష్టదైవమైన కులదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆతర్వాతే పొలం పనులు ప్రారంభిస్తారు.



బియ్యపు ముద్ద ఉండలతో దేవారి పూజలు

‘సీత్ల’ పండుగ

లంబాడీల దేవత సీత్ల అమ్మవారు. కలరా వంటి వ్యాధుల బారినుంచి కాపాడుతుందని వారి నమ్మకం. గ్రామ సరిహద్దు పొలిమేరల్లోని కూడలి వద్ద సీత్ల భవానిని ప్రతిష్ఠిస్తారు. ఆషాఢమాసంలోని ఒక మంగళవారం మహిళలు, యువతులు బోనమెత్తుకుని అమ్మవారి వద్దకు వెళ్లి పాటలు పాడుతారు, నృత్యం చేస్తారు. అమ్మవారికి పాయసం నైవేద్యంగా సమర్పిస్తారు. కోళ్లు, మేకలు బలిచ్చి వాటిపై నుంచి పశువులను దాటిస్తారు. పశుసంపద వృద్ధి చెందాలని, పాడిపంటలు బాగా పండాలని అమ్మవారిని మొక్కుకుంటారు.

పండుగలకు ప్రత్యేకత



ఆదివాసీలు జరుపుకునే పండుగలకు ప్రత్యేకత ఉంది. అకాడి నుంచి ప్రారంభమైన పండుగలు నాలుగు మాసాలపాటు కొనసాగుతాయి. దీపావళికి గుస్సాడీ దీక్ష స్వీకరించే భక్తులు ఇప్పుడే కుల దేవతలకు మొక్కుకుంటారు. కార్యం నెరవేరాక దీక్ష చేపడతారు. – కుర్సెంగ దుందేరావు, ఆదివాసీ నాయకుడు, చౌపన్‌గూడ

వన భోజనాలు..

వనాలతో సన్నిహితంగా ఉన్న ఆదివాసీలు అకాడిలో వనదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గ్రామ పొలిమేరలో ఉండే బాబ్రిచెట్టు వద్దకు వెళ్తారు. చెట్టుకింద ఉన్న దేవత ప్రతిమలను శుద్ధి చేస్తారు. అనంతరం పసుపుతో గీతలు గీస్తారు. వాటి ఎదుటే బియ్యం పోసి రాజుల్ పేన్‌కు ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడే వండిన వంటలతో అడవి దేవతలకు నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేస్తారు. అడవిలోని చెట్ల ఆకులను ఇంటికి తీసుకెళ్తారు.

గుండెపోటుతో డిప్యూటీ తహసీల్దార్ మృతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మహ్మద్ అబ్దుల్ ఆసీఫ్ (ఫైల్)

ముధోల్: ముధోల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ ఆసీఫ్(50) గుండెపోటుతో మృతి చెందాడు. అద్దె ఇంట్లో ఉంటున్న డీటీవో ఉదయం నిద్ర లేవకపోవడంతో గమనించిన ఇంటి యజమాని రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. ఏఎస్సై సుదర్శన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఆర్డీవో రవికుమార్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ముధోల్ తహసీల్దార్ తుకారం, తానూర్ తహసీల్దార్ వెంకటరమణ, ఆర్‌ఐ నారాయణలు అంత్యక్రియల ఏర్పాట్లు పరిశీలించారు.

నాటుసారా పట్టివేత

నేరడిగొండ: మండలంలోని రాజురా గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ఆడే సంతోష్ నాటుసారా విక్రయిస్తుండగా దాడిచేసి రెండు లీటర్లు పట్టుకున్నారు. బెల్లంపాకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న వృత్తి నైపుణ్యశాఖ అధికారి

ఇంద్రవెల్లి: కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర కీలకమని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వృత్తి నైపుణ్యశాఖ అధికారి ప్రశాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూటిషన్, టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులతో మాట్లాడి శిక్షణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బయోమెట్రిక్ చేస్తున్న ప్రక్రియను సంబంధిత టీచర్లను ఆరా తీశారు. ఏజెన్సీ ఏరియాలో ఇటువంటి శిక్షణలు ఇవ్వడంతో మహిళలు కుటుంబ పోషణలో భాగస్వాములు కావొచ్చన్నారు. ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాలకు మరిన్ని శిక్షణ కార్యక్రమాలు అందిస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ చైర్మన్ ఆర్.సురేందర్, డైరెక్టర్ మేదరి శ్యామల, ప్రోగ్రాం అధికారి రాజన్న, సంతోష్, టీచర్లు దుర్గ, ప్రాచీ ఉన్నారు.

ప్రాణం తీసిన ‘కౌలు’ వివాదం

- భూమిని వేరేవారికి ఇచ్చారని మద్యం మత్తులో కత్తితో దాడి
- ఆస్పత్రిలో ప్రాణాలొదిలిన యువకుడు



రిమ్స్ ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరేశ్



అంకుశ్ మృతదేహం

తాంసి: తనకు భూమిని కౌలుకు ఇవ్వలేదని పగతో దాడిచేసిన ఘటనలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అర్లి(టి) గ్రామంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కుమ్ర బావురావు వరుసకు బావమరిది అయిన ఆత్రం అంకుశ్ (24)ను కత్తితో పొడిచి హతమార్చాడు. కొన్నేళ్లుగా గ్రామానికి రాంకిషన్ తనకున్న రెండు ఎకరాల భూమిలో గత ఏడాది వరకూ వ్యవసాయం చేశాడు. ఈ ఏడాది కౌలుకు ఇచ్చాడు. తనకు కాకుండా ఇతరులకు కౌలుకు ఇచ్చాడని కుమ్ర బావురావు పగ పెంచుకున్నాడు. మంగళవారం రాత్రి బావురావు ఈ విషయమై రాంకిషన్‌తో గొడవ పడ్డాడు. రాంకిషన్ కుమారుడు ఆత్రం అంకుష్ జోక్యం చేసుకుని తమ భూమిని ఎవరికైనా ఇస్తామని సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో సహనం కోల్పోయిన బావురావు కత్తితో అంకుష్‌పై కత్తితో దాడిచేయగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. జైనథ్ నరేష్ కుమార్, ఎస్సై రాధికతో కలిసి మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి రాంకిషన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడు రాంకిషన్ పరారీ లో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం..

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల డిగ్రీ కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో బోధించుటకు తాత్కాలిక ప్రాతిపదిక పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్‌సీవో) రాథోడ్ గోపీచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్జెక్టులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకుని నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జియోలజీ, జీవశాస్త్రం, జాగ్రఫీ, హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు, ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా ఆయా జిల్లా కన్వీనర్ (డీసీవో)పాఠశాలల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర సమాచారం కోసం ఆసిఫాబాద్ 9989603070, మంచిర్యాల 9948989949, ఆదిలాబాద్ 8686693042, నిర్మల్ 7993456616లపై సంప్రదించాలన్నారు.

నూతన డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపూలే నూతన డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో గోపీచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలలో బియస్‌సి (ఎంపీసీ), బియస్‌సి (బిజడ్‌సి), బియస్‌సి (ఎంపీసీఎస్), బియస్‌సి (ఎంఈసీఎస్), బియస్‌సి (ఎంపీజీ), బికాం (సిఏ.), బికాం (బిఏ.), బీఏ (హెచ్ పీజీ) తదితర కోర్సులు ఉన్నాయన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్



రోగులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ డాక్టర్లను ఆదేశించారు. బుధవారం ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ వార్డు, డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు అందిస్తున్న వైద్య చికిత్సలను డాక్టర్లు, రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవో మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో శస్త్రచికిత్సలు, సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. వైద్యులు ఉపేందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

అటవీ హక్కు పత్రాలు జారీ...

ఖానాపూర్ మండలం సెవ్యానాయక్‌తండాకు చెందిన గిరిజనులు సర్వే అనంతరం లబ్ధిదారులుగా గుర్తించిన తమకు అటవీ హక్కు పట్టాలను జారీ చేయాలని బుధవారం సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. 30ఏళ్లుగా జిల్లెడుకుంటలో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. గిరిజనులు బానావత్ రవి, తిరుమల, ఉత్తమ్, హస్లీ బాయి, రాజేశ్, రాచందర్, రవి ఉన్నారు.

సొనాల మండల విజయోత్సవ సంబురం



గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- కొందరు అడ్డుకోవడంతోనే ఆలస్యం
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ ఎంపీ నగేశ్

బోథ్: నూతనంగా ఏర్పడిన సొనాల మండల విజయోత్సవ ర్యాలీ సొనాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ ఎంపీ నగేష్, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ హాజరయ్యారు. వీరికి గ్రామస్తులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డోలు వాయిద్యాల మధ్య నృత్యాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోగు రామన్న మాట్లాడుతూ.. సొనాల మండలంగా ఎప్పుడో ఏర్పాటయ్యేదని, కొన్ని పగటిదయ్యాలు మండలం కాకుండా అడ్డుకున్నాయని తెలిపారు. మాజీ ఎంపీ నగేష్, ఎంపీపీ తుల శ్రీనివాస్‌లు పట్టుదలతో కృషి చేశారని అన్నారు. మాజీ ఎంపీ నగేష్ మాట్లాడుతూ..2 016లోనే సొనాల మండలానికి బీజం పడిందని, 2018లో సీఎం కేసీఆర్‌కు ఎన్నికల ప్రచార సమయంలో మండలంగా ఏర్పాటు చేయాలని తానే చెప్పినట్లు పేర్కొన్నారు. మండలం కోసం తీవ్రంగా కృషి చేసినట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జోగు రామన్న, నగేష్, అనిల్ జాదవ్‌లను ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ సదానందం, మండల సాధన సమితి సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాంసి, భీంపూర్ జెడ్పీటీసీలు రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు బోథ్ ఎమ్మెల్యేను పిలవలేదా.?

సొనాల మండలంగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో బుధవారం విజయోత్సవ సభ నిర్వహించారు. అయితే ఈ సభకు బోథ్ ఎమ్మెల్యే మాత్రం రాలేదు. బోథ్‌లో పోడు పట్టాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాపూరావ్ సొనాల విజయోత్సవ సభకు వచ్చే అవకాశం ఉన్నా పాల్గొనకపోవడంపై నేతల మధ్య విబేధాలు బహిర్గతమవుతున్నాయి. కాగా ఎమ్మెల్యేను విజయోత్సవ సభకు పిలవలేదా..? లేక పిలిచినా సభలో పాల్గొనలేదా..అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు

- అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినుల ఫిర్యాదు
- సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేసిన డీఈవో




ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుడు తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని పాఠశాల 9, 10వ తరగతి విద్యార్థులు లిఖిత పూర్వకంగా పాఠశాల హెచ్‌ఎం ముడుగు శామ్యూల్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం వివరాల ప్రకారం.. ఆంగ్లం బోధించే ఉపాధ్యాయుడు సరిగా పాఠాలు బోధించడం లేదని, విద్యార్థినిల పక్కనే కూర్చొని అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఈ విషయాన్ని డీఈవో ప్రణీత దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపింది.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై డీఈవో సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతకు విద్యార్థి జేఏసీ కన్వీనర్ రాహుల్, విద్యార్థి సంఘాల నాయకులు శంతన్‌రావు, నవీన్ కుమార్, అశోక్ డీఈవోకు ఫిర్యాదు చేశారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సైతం విద్యార్థుల విన్నపాన్ని డీఈవోకు వివరించారు. దీంతో సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడితో విచారణ చేయించి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నారు.

ఉద్యాన నర్సరీని పరిశీలించిన శిక్షణ కలెక్టర్



నర్సరీని పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ శ్రీజ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని ఐటీడీఏ అనుబంధ ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని ఐటీడీఏ ప్రత్యేక అధికారి శిక్షణ కలెక్టర్ పి. శ్రీజ సందర్శించారు. నర్సరీ పునరుద్ధరణకు చేపడుతున్న పనులపై ఆరా తీశారు. నర్సరీలో ఈ సంవత్సరం నుంచి మామిడి, కొబ్బరి వంటి పండ్ల మొక్కలతో పాటు మునగ వంటి హైబ్రిడ్ మొక్కలను పెంచుతున్నామని ఐటీడీఏ ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి సందీప్‌కుమార్ వివరించారు. నాణ్యమైన మొక్కలు తయారు చేయడంతో పాటు, రైతులకు అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. మొక్కల ఎదుగుదల చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఉద్యాన అధికారి సుదీర్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

గుడిహత్నూర్: మండలంలోని డోంగర్‌గావ్ వద్ద జరిగిన ప్రమాదంలో కొల్హారీ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. కొల్హారీ గ్రామానికి చెందిన అములు ముండే, ప్రకాష్ తగ్రే మండల కేంద్రం నుంచి కొల్హారీ వెళ్తున్న తరుణంలో డోంగర్‌గావ్ వద్ద ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వీరి బైక్ లారీని వెనుక నుంచి ఢీనడంతో గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన మెరుగు సత్యనారాయణ రెడ్డి అనే రైతుకు చెందిన ఆవు ఆర్లి గ్రామ సమీపంలోని కరెంట్ పోల్ సపోర్ట్ వైర్ తగిలి మృతిచెందింది. పంట పొలంలో సాయంత్రం మేతకు వెళ్లిన ఆవు విద్యుత్ పోల్ సపోర్ట్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత రైతు మండల పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్‌కు సమాచారం ఇచ్చారు. ఆవు విలువ దాదాపు రూ.35వేలు ఉంటుందని సదరు రైతు తెలిపాడు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడి

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన శ్యాం (38)పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. బుధవారం వేకువజామున ఇంట్లో నిద్రిస్తున్న శ్యాంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. అతడి అరవడంతో దుండగులు పారిపోయారు. స్థానికులు శ్యాంను ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నిజామాబాద్‌కు తరలించారు. సీఐ శ్రీనును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

పోడు పట్టా సంబరం



ఏళ్లుగా పోడు హక్కు కోసం ఉద్యమిస్తున్న గిరిజనులకు ఎట్టకేలకు ప్రభుత్వం హక్కుపత్రాలను అందజేసింది. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాల లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. పట్టాలను అందుకున్న గిరి మహిళలు వాటిని చూసి మురిసిపోతున్న దృశ్యమిది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్